# నాకూ ఓ మనసుంది

పన్నెండింటికైనా ఆఫీసుకు వెళ్లకపోతే ఆఫీసర్‌తో గసాలా తప్పదు. రైలేమిటి, ఇంత మెల్లగా వెళుతోంది?

వాచీముళ్లు చూస్తుండగానే జరిగిపోయి పదిన్నర చూపిస్తున్నాయి. జేబులో సిగరెట్లు చాలాసేపటి క్రిందే అయిపోయాయి.

రైలు ఆగిపోయింది.

"కాస్త దిగి కనుక్కునివస్తా, సామానుమీద ఓ కన్ను ఉంచండి" కళ్లజోడు అమ్మాయితో చెప్పి రాళ్లమీదకు దిగి గార్డు పెట్టెవరకూ నడిచాను.

"ఇంజన్ ఫెయిల్ అయింది. వాల్తేరునుండి మరోటి రావాలి."

"అతిదగ్గర ఉన్న స్టేషన్ కోరుకొండ. మనిషిని పంపుతారా?" నా ఆత్రం గార్డును నావైపు పరీక్షగా చూసేటట్టు చేసింది.

"మీరు కంగారు పడకండి మాష్టారూ, మాపద్ధతులు మా కున్నయ్. మరో రెండు గంటల్లో ఇంజన్ వస్తుంది." - గార్డు గొంతులో కొంత విసుగూ, కించిత్ వైరాగ్యమూ వినిపించాయి.

ఓ లెవెల్ క్రాసింగ్ దగ్గర ఆగిపోయింది హౌరా - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్.

రెండు గంటలు.

అంటే వాల్తేరు వెళ్లేసరికి, పదిన్నర - ఇంజన్ రావడానికి రెండుగంటలూ, వచ్చి వాల్తేర్ వెళ్లడానికి మరో గంటా వెరశి మధ్యాహ్నం రెండయేటట్టుంది.

గొంతుతడి ఆరిపోయింది.

దూరంగా మర్రిచెట్టూ, ఎదురుగా నుయ్యీ కనపడుతున్నాయి.

కంపార్టుమెంటు దగ్గరకెళ్ళి కాసేపు తిరిగొస్తానన్నమాటని రెండుగంటల వార్తకి జోడించి చెప్పి మర్రిచెట్టు నీడవైపు నడిచాను.

నూతిదగ్గర తాటాకు రేకతో నీళ్లు తోడుకుని మొహం కడుక్కున్నాను. చెట్టు క్రింద పాకలో టీ దుకాణం కనపడింది.

"మంచి టీ చెయ్!" దుకాణం అసామీకి చెప్పి రుమాలుతో ముఖం తుడుచుకున్నాను.

గాజుగ్లాసులో జర్మన్ సిల్వర్ చెంచా గటగట లాడిస్తూ

"బండి ఆగిపోనాదేటి బాఁవూ!" టీకొట్టు యజమాని పలకరించాడు.

"ఆఁ!" - దూరాన్న లేస్తున్న గోడలవైపు చూస్తూ పరాకుగా జవాబు నాతోపాటు అతనూ గోడలవైపు చూశాడు.

"ఆగిపోద్ది బాఁవూ, ఆగిపోద్ది. మనం ఆగాలనుకుంటేే ఆగదు."

అతని మాటలలోని దైన్యం నా గుండెల్లో గుచ్చుకుంది.

"ఎందుకలా అంటున్నావ్?" అప్రయత్నంగా అడిగాను.

అతని సమాధానం మొదలైంది మొదలు దూరంగా ఇంజన్ కూత వినేంతవరకూ మంత్ర ముగ్ధుడిలా అతనివల్లాపన విన్నాను.

ఆ వృత్తాంతం అతని భాషలో అతను చెప్పినంత శక్తి వంతంగా చెప్పగలగడం అసాధ్యమని నా నమ్మిక. అతని ఆక్రందనా, ఆవేదనా అర్థం చేసుకోగలిగినందుకు ఇంకోళ్ళకి చెప్పకపోతే నాదీ ఓ బతుకేనా? మనసున్న మనిషి చెప్పకుండా ఉండలేని కటిక కన్నీటి వ్యథ.

దురగాలమ్మ గుడిసుట్టూ పదిచ్చన సేస్తంది రెండు సేతుల్తో కోడిపెట్ట నొట్టుకుని గైరమ్మ. ఈరాసాఁవీ సేత్తన్నాడు కొడవ లొట్టుకుని. మూడు సుట్లయినాక దురగాలమ్మ దెగ్గిర దండా లెట్టారిద్దరూ.

"దురగాలమ్మతల్లీ, నా సంటోణ్ణెలా సూత్తావో!" మై మరిసిపోనట్టు మొగవెట్టేసిందిల్లాలు.

ఓసిటంసూసి 'హుఁ' అన్నాడీరాసావి.

"రాయే పెట్టనెట్టుకో!" అన్నాడు మరోసిటంస్తూసి. కోపఁవైపోనాది గైరమ్మ. మొగం దురగాలమ్మకేసి తిప్పేసిండు ఈరాసాఁవి.

సేతులెత్తి పెట్టను దురగాలమ్మకు సూపించుకుంది.

జిగ్గని మెరుస్తున్న కొడవలి కాసాకపాలీ; పెట్టమెడకాసాకపాలీ సూసి కరకరలాడించే సేడీరాసాఁవి.

సేతులెత్తి దండాలెట్టారిద్దరూ.

-బుల్లిగాడు మాత్రం సోద్దెంగా గిలగిల కొట్టుకుంటున్న మొండెం ఏపు సూత్తన్నాడు.

బొట్టెణ్ణెత్తుకుంది గైరమ్మ.

ఎనిమిదేళ్లొచ్చినా ముచ్చటగా నోరు మెదపనేడు బులిగాడు. ఆడంటే దానికిపేనం. ఎవరూ సూడకుండా ఎత్తుకుని ముద్దు లాడుతుంది.

బొట్టిడికి మాయదారి రోగం ముంచేసి రెండేళ్లైపోనాది. మాటొడిపోయిందన్నాడు వొయిజ్జుడు. మాటేకాదు పడిపోత. గొంతూ సెడిపోనాది. గుటకపడక తికమదొడిపోతాడు. నోట్లో ఏం బెట్టు కున్నా కిందకి సగం కారిపోతాది. పిడికిడు మెతుకులూ, బుక్కెడు గంజీ ఆడికెట్టడానికి గంటొడతాది. ఆడకోసం కొడుకో కొడుకో అని గిలగిల్లాడుతాది గైరమ్మ.

ఈరాసాఁవికి ఏదో పరాకు, మనసులో ఏదో సిరాకు, గైరమ్మను సూత్తే మతిపోతాది. సేపఁవెట్టినట్టు బుల్లిగాడికి సుస్తీసేసిన రెంణెల్లు తిరక్కండానే టపీటపీమని పోపనారు మల్లమ్మా, నాగులమ్మా.

మంచం వెక్కిపోనేదు గాని కునుకెట్టడం మానీసింది గైరమ్మకి. గైరమ్మకి అండ తాటాకులింటి నూకాలు. శోకాలెడుతూ ఎర్రసెరువుత్తర గట్టునున్న ఏపసెట్టుమీది దెయ్యం ఓడ్డల గొంతు నులిమిందని పూనకంలో సెప్పింది.

నూకాలికి గడిగడికీ పూనకం వొత్తానే ఉంటాది.

ఏపసెట్టుమీది దెయ్యం ఈరాసాఁవి కొనుక్కొన్న గుడిసిలోని కన్నెపడుసు గైరి. గైరికి ఈరాసాఁవంటే పేనం అని సెబుతుంటాది నూకాలు.

గైరమ్మలో గైరిని పోలికలు సూసుకోడం నేర్చుకున్నాడీరాసాఁవి. గైరి సావెనకాల నిజం నూకాలు పూనకంలో ఓనాడు పొక్కి పోనాది.

అయ్యాలాదివోరం. ఐదేళ్ల మల్లమ్మెలిపోనాది సొరగానికి. గడపమీమ్మద సోకాలెడుతున్న నూకాలు నేచి నుంచుంది. కళ్లు సింత నిప్పుల్లా కణకణలాడిపోతున్నాయ్.

నీ సిగదరగా, గైరీ, నేకపోతే నేకపోయె. ఎవడికేది అనుభోగమో. పట్నంవెల్లిపోయినోడు ఎల్లేపోనాడు. ఆడిమీద మనసు సంపుకోక దీని బొట్టిని పొట్టనెట్టుకుంటావటే ! నీ జిమ్మడ! గైరమ్మనాంటి మనిసుందే? ఏనాడైనా నీమీద ఏటైనా అనుకుందా? ఈరాసాంవి నీకేటి దోహం సేసినాడనీ, కచ్చవేసుకుంటున్నావ్! కులికి నన్నాళ్లు కులికేవ్! నీ పేనం తీసుకోమన్నాడటే ఈరాసాంవి. నంజకానా, గైరమ్మ వుసురు నీకు తగలకుండుంటాదా? దయ్యవై సాధిస్తావటే, నీ సిగదరగా!"

నూకాలా మాటవిని మాంవిడి తోట్లోకీ జారిపోనాడు ఈరాసాంవి. శివాలెత్తిన అమ్మోర్లా నాలిక సాపుతున్న నూకాలేపు సూసి దిక్కు తోచనేదు గైరమ్మకి.

"నానేటి సేతున్రోయ్ భగమంతుడా, ఈ గైరివర్తిరోయ్ - దెయ్యం దెబ్బతినిసేవ్ కూతురోయ్!"

తల్లికాసి సూస్తూండిపోనాడు బుల్లోడు. రెండు కన్నీటి బొట్లు ఆడి నోటమ్మటొచ్చే చొంగలో కలిసిపోనాయ్.

మరో నెల తిరగనేదు. నాగులమ్మకి ఒల్లమాలిన సలపరం. ఒళ్లు మరిగిపోనాది. మూసిన కన్నెత్తనేదు. చెల్లిమల్లెమ్మ ఎర్రిసూపు సూత్తండగా గోడేపు తిరిగిపోయిన నాగులమ్మకు అపస్మారకం ఒచ్చి ఒళ్లు అంపరమెత్తేటట్టు గావుకేక లెట్టేసినాది. ఒంటిమీద ఒడ్లగింజేస్తే పేలగింజవుతోంది.

"ఓలమ్మో! నాగులికి పాము కరిసేసిందోలమ్మో!" అని కెవ్వును కేకసి కళ్లు మూసేసుకుంది.

ఈరాసాంవి కొక్కపాలి తెలివి తెల్లిరిపోనాది. సైకిలేసుకుని యిజీనారం లగెత్తు కెళ్లాడు డాట్రు దెగ్గిరికి.

కారేసు కొచ్చేడు సంజీవి డాట్రు. ఎనకకంపోడ్రూ ఉన్నాడు. బాసలో ఏదేదో అన్నాడు. సూదిమందు లిచ్చాడు. మూడుగంటల సేపు బొట్టికాడే కూకున్నాడు. గైరమ్మకి ఒక సిటం ఊపిరాడనేదు. ఇటు డాట్రు సేవ, అటు బొట్టి సేవ.

పొద్దుకూకులా కూకున్న డాట్రు నాగులమ్మమీద గుడ్డకప్పి మరీ ఎల్లిపోనాడు, ఆ రేత్తిరికి మల్లొచ్చింది నూకాలికి పూనకం. ఊరంతా అట్టుడికిపోనాది.

"అవునేగైరీ, నీకేటి పోయికాలవంటే, ఆడికాడికి పోయుంటే నిన్నెవడడుగునే, నంజనా, ఆడి బిడ్డల్ని పొట్టనెట్టుకుంటావటే. ఆడు నీ బిడ్డని సంపుకోమన్నాడంటే, ఆడికరమాన్నాడెల్లిపోనాడు. కులికిన గుడిసేటేవి ఆడితో సెప్పొద్దూ పీకలమీద కొచ్చిందని, యిజీనారానికి ఈడకీ ఏళ్లా, గెడ్డలా ఎల్లి సెప్పకపోనావా? ఇదేంటిదే, ఇలా అందర్నీ పొట్టనెట్టుకుంటావటే, ఆ మూగనాయాలు ఆణ్ణి తీసుకుపోరాదటే, నోరునేక పడున్నాడు, రతనంనంటి బొట్టి, దీన్నెత్తుకుపోయేవే, నీ సిగదరగా!"

ఆకాసంనోకి సూత్తుండిపోనాది గైరమ్మ.

ఈరాసాంవి కంటతడి ఇగిరిపోనాది.

గైరమ్మలో గైరినిసూసుకునే ఈరాసాంవి నూకాల పూనకం లోని పేలాపన విని గైరిమీద మనసులో సేదు నింపుకున్నాడు.

పూనకం విడిసేసిన తరువాత తనకు తెలిసిందంతా గైరమ్మకి సెప్పేసింది నూకాలు.

-ఈరాసాఁవిమీద రంగైపోయిందె గైరి. ఉన్నట్టుండి ఈరాసాఁవి యిజీనారాం ఎల్లిపోనాడు ఫెట్రీలో పన్జెయ్యడానికి. అంతే మరి రానేదు. ఆడికోసం సూసి సూసి రెంణెల్లెల్లినాక నూతులొడి పోనాది గైరి. నీళ్లమింగేసింది నంజ కడుపుబ్బి పోనాదన్నారందరూ. గైరి తల్లెప్పుడో పోనాది. తండ్రి మంచవొట్టిపోయి గుటుక్కు మన్నాడు. గైరి తమ్ముడు కొంపమ్మేసుకుని పట్నమెల్లిపోనాడు. ఈరాసాఁవీ కొంపకొనుక్కుని నిన్ను కట్టుకున్నాడు.

ఈ మాట విన్నాక మరి ఆడితో నిద్దర సెయ్యనేదు గైరమ్మ.

నూకాలికి బాదగానే ఉండేది గైరమ్మ ఒరస. సోకాలెడుతూనే ఉండేది గడపమీ్మద కూకుని. గైరిని సేపనాకారాలెడుతూ.

గుడిసెట్ నంజా, నీ జీవానికుసూరుమంటూ ఇద్దరు బొట్టెల్నీ నీ కర్పించి ఆ రోగిట్టెదవకోసం పేనాలెడుతుందే బొట్టి గైరమ్మ. కంటిక్కునుకు నేదు. నీ కచ్చ తీరుసుకోడానికి ఆ బుల్లోడి నిదిలేసేవ్ గదే, మరి గైరమ్మకి సుకంనేదా?

-ఎండ బడొచ్చిన బుల్లోడీ మాటలిన్నాడనీ, ఆడికొక మనసుందనీ తెలుసుకోలేక పోనారెవరూ.

- ఇది చెవినబడ్డ గైరమ్మ తోక తొక్కిన తాచులా లేచింది.

"బుల్లోడిననకప్పా! ఆడికరమ, నా కంటంలో పేనవుండగా ఆడి కేనోటూ సెయ్ను. - ఆడే నాకన్నీ. బొట్టెడి మీది మమకారంతో ఈరాసాఁవి కళ్లల్లో నీళ్ల నిండేయ్.

- నూకాలమ్మ సెప్పింది నిజం. దీని సిగదరగ తనమీద కచ్చకొద్దీ గైరమ్మనీ బొట్టిల్నీ సతాయించి సంపుతోంది. పిల్లల్ని తినేసింది. తనేనేటి తెలివి తక్కువోడు!

అర్ధరేత్తిరి మెరుపులాంటాలోసనొచ్చి దిగ్గున మంచంమీద లేచికూకున్నాడిరీసాఁవి.

"ఒలేయ్!"

బొంతమీదనుంచే అడిగింది కునుకు మరిసిపోయిన గైరమ్మ ఏటిమాఁవా?

"ఇక దీని ఆట కట్టించేత్తా, పద రేపే ఎలదాం కొత్తొల్స. బూత వయిజ్జుని కాడికి. దీని పని పట్టించేత్తా. పడవటింటి పొలానూర్సిన బాపతు మూడొందలూ బట్టుకెళదాం."

- బుల్లోడికి ఒయిజ్జుడంటే కారుమీదొచ్చిన డాట్రేగేపకం.

నూట పదార్లుచ్చుకున్నాడు పంతులు. కరుసులైనాయి మరో వంద. నాలుగురోజులైపోనాక ఒయిజ్జమైపోనాది ఇంటికెల్లి పొమ్మన్నాడు.

గైరమ్మ కొండందుకుంది. పీడ ఇరగడ్డైతే బుల్లిగాడికి మామూలు మాట రావొచ్చు. బుల్లిగాణ్ని మేట్టరు కాడెట్టాల కొత్తొల్సలో బయల్దేరేముందర పలకా పుల్లాకొంది. కుసింత దూరం ఒచ్చినాక యాదస్తొచ్చి ఎనక్కెల్లి ఓ పెట్టెడు పుల్లలుకొంది. ఓ రెండు కమీజులూ, రెండు సెడ్డీలు కొంది. బగమంతు డిచ్చిన కాడికి బొట్టిడికేనోట్టూ ఏకుండా సూసుకోవాల.

అబ్బ! ఇక గైరి పోరొదిలినట్టే -

ఈరాసాఁవి దోవలో టీకొట్టుకాడ టిపినూకాపీ ఇప్పించినాడు గైరమ్మకి. సాఁలోజులికి తృప్తిగా ఇంత తిన్నాడు. సిలిపిగా మురిసిపోతన్న కల్లతో గైరమ్మ కేసి సూసిన్వేడు. గైరమ్మ బొట్టిడికేసి సూసింది.

- 'అమ్మా', గైరమ్మకి మాత్తరం తెలిసేటాసలో అడిగాడో నాడు.

"ఎర్రాబుల్లీ!"

"మరేంనేదే, మనింటోనూ ఓ బుల్లెమ్మంటే ఎంత బావుంటాదే." నూకాలమ్మ బొట్టి గూనంత కడుపుతో ఒచ్చి వోరం వెల్లకుండా బిడ్డనెత్తుకుంది.

నిట్టూర్చి ఆడి తల నిమిరింది గైరమ్మ.

ఆమె ఇసారానికి అరదం తెలుసుకోలేకపోనాడు బుల్లోడు.

గైరమ్మ కా ఆలోసనొచ్చినప్పుడల్లా బుల్లోడిని గుండెకద్దుకుంటుంది.

- రైలుపట్టాలపక్కబడి నడుస్తున్నారు ముగ్గురూ! ఈరాసాఁవి సేత్తో టంకుపెట్టీ మునకాలకర్ర. గైరమ్మసేతిలో నుంచీ బుల్లోడు నడిసొస్తన్నాడెనకాల.

తుప్పెనకాల కెల్లింది గైరమ్మ.

ఇదిగో ఈ భూతఁవే లగెత్తుకొచ్చింది. ఓసిటంలో అంతా జరిగిపోనాది. బుల్లోడు రెయిలుకిం ఁకెలిపోనాడు. తలకి తలా, మొండేనికి మొండెఁవూ. బండి ఆపనైనా ఆపనేదుబాఁవూ.

- బావురు మన్నాడు టీకొట్టు మనిషి.

చెమటలు కక్కుకుంటూ వచ్చాడు మరోమనిషి. దూరాన్న లైను ద్గరే కడుతున్న గోడల దగ్గిర్నించి. మన్ను కుమ్మిన కాళ్లు నూతి దగ్గర కడుక్కుని మళ్లీ వచ్చాడు కొట్లోకి.

"ఈరాసాఁవీ! ఓ రెండు పుణుకులెట్టు!"

ఆశ్చర్యంగా తలెత్తి చూశాను.

పుణుకులు ప్లేట్లో పట్టుకుని ఓ మూలకెల్లి తింటున్నాడు. మన్నుకుమ్ముతూ వచ్చిన పనివాడు.

కొంచెం తటపటాయించి మళ్లీ ప్రారంభించాడు ఈరాసాఁవి.

"అసలు గోరం తమరింకా ఇననేదుబాఁవూ; మీరు. గైరమ్మ మతి పోయినట్టయిపోనాది. అదే రేత్తిరీడనే ఒచ్చి గూడ్సుకింద పడిపోనాది....నాకు ఇక కొంపెందుకు బావూ! అన్నా ఒదిలీసుకున్నా. ఈ కొట్టు కొనుక్కుని, నాగైరమ్మనీ, నా బుల్లోణ్ణీ సూసుకుంటూ కూకుంటున్నా, పొద్దుగూకులా! అదిగో పేరంటాలు గుడి లేచిపోతోంది."

కళ్లొత్తుకుంటూ "వీరాస్వామీ, నీకు భగవంతుడే అన్యాయం చేశాడు" అన్నా. కరుణార్తుడికి నిస్సహాయి చూపించే మొండి చెయ్యిలాంటి శుష్కప్రియం, ఊరడింపుమాట.

అవసరానికి ఆగని రైలు, నా అవసరం దాటాక బద్ధకంగా ఆవులించి కదిలింది.

భారతి, జూన్ 76